విశాలాంధ్ర కృష్ణా జిల్లా

గాలివానకు విరిగిన చెట్లు-విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో శనివారం రాత్రి విస్తృతంగావీచిన గాలులు తో కురిసిన వర్షంతో విద్యుత్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ గాలుల మూలంగా కూచిపూడిలోని పొలాలకు, స్మశానానికి వెళ్లే రహదారిపై భారీచెట్టు పడటంతో కరెంటు వైర్లు తెగిపోయాయి. ఈ సమయంలో కరెంటు పోవడంతో ఏ విధమైన ఇబ్బందులు కలగలేదు. గాలులతో కూడిన వర్షం మూలంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో కరెంట్ పోయింది. దీనితో పాటు పలు ప్రాంతాలలో చెట్లు విరిగి 33 కెవి లైన్ పై కూలిపోవడంతో గంటల తరబడి కరెంటుకు అంతరాయం ఏర్పడింది. కారకంపాడు, అయ్యంకి యద్దనపూడి, కూచిపూడి తదితర ప్రాంతాలలో ఈ సమస్య కొనసాగింది. మొవ్వ మండలానికి ఇన్చార్జిగా కొనసాగుతున్న ఏడిఏ (పామర్రు) సుందరరావు పర్యవేక్షణలో కూచిపూడి గ్రూపు ఎల్ ఐ శ్రీహరితో పాటు సంబంధిత లైన్మెన్లు, సిబ్బంది చర్యలు చేపట్టి విద్యుత్తు ఆదివారం మధ్యాహ్నం కు పునరుద్ధరించారు.

ఏఎస్ఐకు డీఎస్పీ సత్కారం

విశాలాంధ్ర-కోడూరు : కోడూరు పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆంజనేయులును పోలీసుస్టేషన్‌లో అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆదివారం ఘనంగా పూలమాల, దుశాలవలతో సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ ఆరుపదుల వయసులో కూడా ఎంతటి బాధ్యతను అప్పచెప్పిన దానిని తక్షణమే ఆ బాధ్యతను నిర్వహించి విధుల పట్ల ఎంతో అంకిత భావంతో పనిచేస్తున్న వ్యక్తి అని, ఉద్యోగ నిర్వహణనే కాకుండా నిరుపేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాలు పంచుకొని తన వంతు సాయాన్ని అందచేసే వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సి.ఐ.శ్రీనివాస్, ఎసై. వి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కాలువలకు నీరు విడుదల

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సాగయ్యే వరి పైరునారుమడుల కోసం నీటిపారుదల శాఖ సాగునీరు విడుదల చేసింది. దీనితో ఆదివారం భీమనది ఛానల్‌కు జలకళ వచ్చింది. పమిడిముక్కల మండలంవీరంకి సెక్షన్ నుంచి ప్రారంభమైన ఈ కాలువ మొవ్వ మండలం మీదుగా ఘంటసాల మండలం దాకా వెళుతుంది. ఇప్పటిదాకా ఆయిల్ ఇంజన్ల కింద, విద్యుత్ మోటార్ల కింద నారుమడులుపోసుకున్న రైతులు పంటకాలవలోని నీరు వినియోగించుకుని ఆకుమడులు పోసుకోవడానికి అవకాశం లభించింది. దీనికి తోడు శనివారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షం భూములు చల్లబడటానికి ఉపయోగపడింది. పగలు వాతావరణం నారుమడులు కోసం భూమి దున్నుకోవడానికి అనువుగా ఉండటంతో పథకాలనికి రైతులు సమాయత్తమవుతున్నారు.

అధ్వానంగా రోడ్లు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : మండలంలోని వాణిజ్య కేంద్రమైన లక్ష్మీపురంలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీపురం రంగా సెంటర్ నుండి పోదు వెళ్ళే అండ్ బి రహదారి వాహన చోదకులకు తీవ ఇబ్బందులు కలిగిస్తుంది. ఈ రహదారిపై గుంటలు పడి ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్డుపై గుంతల్లో నీరు నిలబడి వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ రహదారికి మరమ్మతులు చేయమని ఆర్ అండ్ బి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని సర్పంచ్ పులగం సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ఈ రోడ్డును మరమ్మతులు చేయాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రహదారి 216 జాతీయ రహదారికి అనుబంధంగా ఉండడంతో ప్రతినిత్యం రద్దీగా ఉంటుంది. తీర ప్రాంత గ్రామాలను జాతీయ రహదారికి ఈ రోడ్డు మార్గమే అనుసంధానం చేస్తుంది. ప్రతినిత్యం ఆక్వా రైతులు ఆక్వా ఉత్పత్తులు ఈ రహదారిపైనే తరలిస్తారు. ఇటువంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన రహదారి గుంటలు పడి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణం ఈ రోడ్డును మరమ్మతులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గృహ నిర్మాణాలపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : పెదపారుపూడిలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకము ద్వారా అర్బన్ ఏరియాలలో అర్హత ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో ఇచ్చే రుణాలతో ఇంటి నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ మల్లికార్జున రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పి ఎం ఏ వై పథకమును ప్రారంభించి ఈ ఏడాదికి ఎనిమిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గృహ నిర్మాణ లబ్ధిదారులకు, అవగాహన కల్పించేందుకు పెదపారుపూడి గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పథకం వివరాలు రూ 1,80,000లు ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో లబ్ధిదారి అకౌంట్లో వేస్తున్నందున ఇంటిని నిర్మించుకునే వ్యక్తులు ఈ అవకాశమును సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, సర్పంచ్ సప్పిడి సమీరా కిషోర్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎస్.ఎస్.బి యూనివర్సల్ హోమియోపతి స్టోర్స్ వద్ద డాక్టర్ సి.హెచ్ రవీంద్ర ఆధ్వర్యంలో హోమియో వైద్య నిపుణులచే నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం 5 వ వార్డులో గల ఎస్.ఎస్.బి హోమియోపతి స్టోర్స్ వద్ద అంతర్జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ ఆధునిక, ఆర్.ఎన్.ఎ, డి.ఎన్.ఎ మాలిక్యూల్స్ తో క్యాన్సర్ వ్యాధికి ప్రత్యేక శిక్షణ ఉందని, హోమియో మందులు దీర్ఘకాలికంగా వ్యాధులతో భాదపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడితే ఎటువంటి వ్యాధి అయినా నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి రాజేషం, పిన్నమనేని బాబు సిబ్బందితో కలిసి పేషెంట్ లకు ఉచితంగా హోమియో మందులను, డ్రాప్స్‌ను అందచేశారు.

సాధారణ వ్యక్తి కవిగా రచయితగా ...

విశాలాంధ్ర-అవనిగడ్డ : మచిలీపట్నం వాస్తవ్యులు బత్తిన అగస్త్యేశ్వరరావు నటుడిగా, గొప్ప రచయితగా పేరు పొందాలని మాజీ ఉపసభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో బత్తిన అగస్త్యేశ్వరరావు రాసిన జగదీకవీరుడు అతిలోక సుందరి 2 తెలుగు సినిమా నవలను బుద్ధప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అష్టవధాని పాలపర్తి శ్యామలానంద్ ప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ , తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, వి వి ఫణికుమార్, చల్లపల్లి లక్ష్మణరావు, కళ్యాణ్, మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ ఘంటశాల రాజమోహన్‌రావు తదితరులు పాల్గొని రచయితను మండలిని దుసాలువాతో సత్కరించారు.

వ్యవసాయ కార్మిక సంఘంలో సభ్యులుగా చేరండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : కృష్ణాజిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు వచ్చే నెలలో నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా కన్వీనర్ మెరుగు విజయ్ కుమార్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టం కొరకు, సంక్షేమ పథకాల అమలుకై నిత్యం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రమ స్తోందన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి ఒక ఎకరం సాగు భూమి మంజూరు చేయాలని, ఒక కుటుంబంలో ఒకే ఒక్క పెన్షన్ షరతు కాకుండా కుటుంబంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేయాలన్నారు. వృద్ధాప్య పింఛన్‌ను రూ.5 వేలు, జగనన్న గృహానికి రూ.5 లక్షలు మంజూరు, లేదా ప్రభుత్వమే నిర్మించి లబ్ధిదారునికి అందించాలని అన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు (నీరు, రహదారులు, విద్యుత్, సైట్ లెవలింగ్) కల్పించాలని ఆయన అన్నారు. వచ్చే నెల జూలైలో పెనమలూరు నియోజకవర్గం ఈడుపుగల్లు గ్రామంలో మహాసభ నిర్వహిస్తున్నామని ఈ సభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దగాని సంగీతరావు, ఒంటి పులి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బందరు కాల్వకు జలకళ

విశాలాంధ్ర-పమిడిముక్కల : విజయవాడ నుండి మచిలీపట్నం నికి సాగు, తాగునీటికి బందరు కాలువే ఆధారం. బందరు కాలువ కంకిపాడు వీరంకిలాకు నిడుమోలు లాకు ద్వారా కొన్ని వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. బోర్లు లేని రైతులు ఈ కాలువ ద్వారా నారుమళ్లు పోస్తున్నారు. వర్షాలు విరి విరి గా పడితే త్వరగా నాట్లు వేస్తామని రానున్న రానున్న ఆపదల నుండి పంటను కోవచ్చని రైతులు అంటున్నారు. ఎండ వేడికి పశువులు తట్టుకోలేక పోయాని బందరు కాలువ వుంటే సమస్య వుండదని ప్రభుత్వం సకాలంలో సాగు నీరు అందించటం తో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రంగా 76వ జయంతి కార్యక్రమానికి ఆహ్వానం

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 76వ జయంతి వేడుకలను జయప్రదం చేయాల్సిందిగా ఆహ్వానసంఘం ప్రతినిధి ఆకుల శ్రీనివాస్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జులై నాల్గవ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే జయంతి వేడుకలకు రంగా అభిమానులకు ఆహ్వానం పలికేందుకు ఆదివారం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన చల్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్ను కలిసి ఆహ్వానపత్రికను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎ.చంద్రరావు, కెవి. సత్యనారాయణ, సలీం, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు రాయడానికి
రచయితలు ముందుకు రావాలి

విశాలాంధ్ర-కూచిపూడి : రచయితలు సమాజాన్ని ప్రభావితం చేసేందుకు రచనలు చేయాలని మాజీ మంత్రి, మాజీ ఉపసభాపతి, తెలుగు భాషాభివృద్ధి నిరంతర చింతనకర్త డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ ఆకాంక్షించారు. సమన్విత, సేఫ్, కామ్రేడ్ జి ఆర్ కె-పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల కథాకార్యశాల ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చినముత్తేవిలో అజయ్‌భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్త ప్రసాద్ ప్రసంగిస్తూ గురజాడ దిద్దుబాటుతో ప్రారంభమైనకథ నేటి వరకు ఎన్నో మార్పులకు నాంది పలికిందన్నారు. గురజాడ, కందుకూరి వీరేశలింగంలు తమ రచనల ద్వారా సంస్కరణ ఉద్యమాలు నడిపించారన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సామాజిక చైతన్యానికి అక్షరమే ఆయుధమని ప్రతి రచయిత తమ అక్షరాల ద్వారా సామాజిక చైతన్యానికి బాటలు వేయాలని సూచించారు. దీనికోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన కథకులు సమున్నతమైన సాహిత్యాన్ని అందించాలని సూచించారు. ఈ సభలో సమన్విత కార్యదర్శి శాంతి శ్రీ, సహాయ కార్యదర్శులు వౌరప్రసాద్, వల్లమూడి పద్మ, సమన్విత కన్వీనర్ దుట్టా శమంతకమణి, సమన్విత కో కన్వీనర్ కే ఉషారాణి, సభ్యులు ఆర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయితలను ప్రశంసా పత్రాలతో, పతకాలతో సత్కరించారు.

సేవా రంగం- సమకాలిన వినూత్న విధానాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రభుత్వ డిగ్రి కళాశాలలో భారతీయ విత్త సేవారంగం - సమకాలిన వినూత్న విధానాలపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రి కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి రాజనాల అంకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గుంటూరు జిల్లా ప్రాంతీయ సంయుక్త ఉప సంచాలకులు(ఆర్‌జెడి) డాక్టర్ వి రమా జ్యోత్న కుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విత్త రంగంలో ముఖ్యంగా బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ , డిజిటల్ కరెన్సీ రంగాలలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించే దిశగా ఈ జాతీయ సదస్సును ఏర్పాటు చేసిన వాణిజ్య శాస్త్ర విభాగాన్ని ఆమె అభినందించారు. డి ఉమారాణి మాట్లాడుతూ డిజిటల్ వాడకం పెరిగిన తరువాత ఇంటి నుండే వినోదం విజ్ఞానం, రవాణా, మార్కెటింగ్ తో సహా అన్నీ సౌకర్యాలు మన అరచేతిలోనే ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుని కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బరంపురం యునివర్సిటీ(ఒడిస్సా) ప్రొఫెసర్ బి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుటుంబంలో స్త్రీని బెస్ట్ ఫైనాన్స్ మేనేజర్ అన్నారు. పలు కళాశాలకు చెందిన అధ్యపకులు జాతీయ సదస్సులో నిర్ణీత అంశాలపై పత్ర సమర్పన చేశారు. బంటుమిల్లి ప్రిన్సిపాల్ సూరగం జగన్‌మోహన్‌రావు ఇంతటి ఉపయోగకరమైన సదస్సును ఏర్పాటు చేసిన వాణిజ్య శాస్త్ర అధ్యపకులను కెప్టెన్ డాక్టర్ సి నాగరాజు, దీనా ఎలిజబిత్, శేషగిరిరావు, జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి శాంతకుమారి, ఐ.క్యూ.ఎ.సి కో ఆర్డినేటర్ డాక్టర్ పి బి సంధ్య, కళాశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

మహిళ క్రికెట్ జట్టు ఎంపికలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: కృష్ణాజిల్లా క్రికెటర్ అసోసియేషన్ ఆడహ కమిటీ ఆధ్వర్యంలో అన్ని వయసుల వారికి మహిళా క్రికెట్ జట్టు క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 30వ తేదీన ఉదయం ఏడు గంటలకు నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే ఈ ఎంపిక ట్రైల్స్ కు క్రీడాకారులు హాజరుకావాలని తెలిపారు. అండర్ 15 అమ్మాయిల క్రికెట్ జట్టు ఎంపిక కోసం 2008 లేదా ఆ తరువాత జన్మించిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు క్రీడాకారులకు కటాఫ్ తేదీని 2008 9 ఒకటవ తేదీ ఆ తర్వాత కానీ లేదా అంతకు ముందున పుట్టిన వారిగా చెప్పారు.

2010 ఎనిమిది 31 తేదీ ప్రకారం 13 నుండి 15 సంవత్సరాల వయస్సు ఉన్న ఆటగాళ్లు మాత్రమే ఈ ఎంపికకు అర్హులుగా లెక్క తేల్చారు అండర్ 19 బాలికల జట్టు ఎంపీ కోసం 2004 సెప్టెంబర్ ఒకటి లేదా తరువాత పుట్టిన వారై ఉండాలని చెప్పారు అండర్ 23 మహిళల జట్టు ఎంపిక కోసం 2000 సంవత్సరం సెప్టెంబర్ ఒకటవ తేదీ లేదా తర్వాత పుట్టిన వారే ఉండాలని తెలిపారు సీనియర్ మహిళలకు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని అధికారులు తెలిపారు అన్ని వయసుల మహిళలు క్రీడాకారులు పుట్టిన తేదీ సర్టిఫికెట్ తో పాటు ఒరిజినల్ డాక్యుమెంట్లు ఒక జిరాక్స్ కాపీ తో పాటు ట్రైల్స్ కు హాజరుకావాలని సూచించారు.

భక్తుల సౌకర్యార్థం గ్రావెల్ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి నిత్యం వేలాదిగా భక్తులు వస్తున్న దృష్ట్యా గ్రామంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని సుబ్బయ్య గూడెం వెళు ్ర దారి మైత్రి రోడ్డు నుండి అమ్మవారి కళ్యాణం జరిగే స్థలం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుగంచిప్రోలు మైత్రి రోడ్డుతో పాటు కరకట్ట నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. వెంటనే అధికారులను అంచనాలు తయారు చేయమని తెలిపారు. పెనుగంచిప్రోలు దేవస్థానానికి నిత్యం భక్తులు రద్ధి ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ ను నియంత్రించేందుకే ఈ గ్రావెల్ రోడ్డు నిర్మాణం కి శంకుస్థాపన చేపట్టడం జరిగిందనిఅన్నారు.త్వర లో నే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈ ఓ రమేష్ నా యు డు, చై ర్మన్. ఇంజం. కేశవ రా వు.గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, జడ్పిటిసి వూట్ల.నాగమణి,ఎంపీపీ మార్కపుడి.గాంధీ,మాజీ ఎం పి పి. గుడపాటి. శ్రీను.మండలవై సి పి పార్టీ అధ్యక్షులు వుట్ల నాగేశ్వరరావు,సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్,విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి,రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు,చెని కుమారి,నాయకులు గింజుపల్లి శ్రీనివాసు,గుంటుపల్లి వాసు, పిడికిటి కోటేశ్వరరావు,దానయ్య, బొసెట్టి బ్రహ్మం,రంగి శెట్టి. దుర్గా,బెజవాడ. శ్రీను.ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఊరచెరువును నింపేందుకు చర్యలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఊరచెరువు నింపేందుకు జలవనరుల శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. అవనిగడ్డ శివారు కొత్తపేటలోని అగ్రహారం ఊరచెరువును నీటితో నింపేందుకు ఇరిగేషన్ శాఖ సిబ్బంది జగన్ ఆధ్వర్యంలో ఆదివారం చర్యలు ప్రారంభించి డ్రైనేజికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఊర చెరువులను నింపే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు జగన్ తెలిపారు. పూర్తి స్థాయిలో నాగాయలంక, కోడూరు రహదారి నుండి ఊర చెరువు వరకు ఉన్న డ్రైనేజి ని పూర్తి స్థాయిలో ప్రక్షాల చేసి మంచి నీటితో నింపేందుకు చర్యలు చేపట్టారు.

ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జిల్లాల విభజన లో భాగంగా ఎన్ టి ఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం వైబ్రంట్ హోటల్‌లో జరిగాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ వాది డి రమేష్ కుమార్ ఎన్నికల అధికారి గా వ్యవహ రించి ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గంను ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ పరిశీలకులుగా బి.శివరాం హాజరయ్యారు. అధ్యక్షులు, కె.తరుణ్ కుమార్(రోయింగ్) సీనియర్ ఉపాధ్యక్షులు జి ఎస్ సి బోస్(బాస్కెట్ బాల్) ఉపాధ్యక్షులు ఎన్.చంద్ర కళ (రగ్బీ), కార్యదర్శి కె. సుగుణ రావు(సైక్లింగ్),జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి వి ఎస్ శ్రీధర్(రైఫిల్ షూటింగ్),ఎన్ వి వి కిరణ్మయి, కోశాధికారి జె.సింహాచలం(హ్యాండ్ బాల్) కార్యవర్గ సభ్యులుగా. ఐ.వెంకటేష్,ఎస్. జె ప్రవీణ్(బిలియర్డ్స్), బి.రవితేజ (బాక్సింగ్), ప్రసన్న(నెట్బాల్), సీఈవో ఎన్.పవన్ కుమార్(రోయింగ్) లు ఎన్నికయ్యారు.

పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర విజయవాడ (లబ్బీపేట) : సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గ ఫ్లైఓవర్ దగ్గర ఆదివారం అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. వందలాది మంది అన్నార్తులు వచ్చి ఇటువంటి మంచి కార్యక్రమం చేసినందుకు ఆ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సి.ఇ.ఓ. . కార్తీక్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

చెడు నడవడికను మార్చుకోవాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : చెడు నడవడికను మార్చుకుని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని డిఎస్పీ పి మురళిధర్ పిలుపునిచ్చారు. అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడవడిక కలిగి నేరచరిత్ర కలిగిన వారిపై నమోదు అయిన కేసును దృష్టిలో పెట్టుకుని ఆదివారం పోలీస్ స్టేషన్ లో వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. చెడు నడవడిక కలిగిన ప్రతి ఒక్కరూ ఎటువంటి వివాధాలకు తావు లేకుండా సత్‌ప్రవర్తన కలిగి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడకుండా ఉండాలని మీ పై నిరంతరం పోలీస్ వారి ప్రత్యేక నిఘా ఉంటుందని, పనులపైగానీ, ఇతరత్ర కారణాలతో బయట ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలన్నారు. సత్‌ప్రవర్తనతో ఉండి అనారోగ్య సమస్యలతో భాదపడుతున్న పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి కేసులు లేకపోయినా విచారించి చట్టపరంగా వారిపై ఉన్న షీట్స్‌ను మూసివేయడం జరుగుతుందన్నారు. వీరిలో చట్టాన్ని ఎవరు ఉల్లంగించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్, ఎస్.ఐ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణా జిల్లా ఒలింపిక్ సంఘం (కేడీఓఏ) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవ పరుగుకు విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు, క్రీడా, క్రీడల సంఘం ప్రతినిధుల నుంచి మంచి స్పందన లభించింది.నగరంలో వర్షం కురుస్తున్నప్పటికీ దాదాపు 400 మంది క్రీడాకారులు, వాకర్లు, క్రీడలు మరియు ఆటల ప్రతినిధులు ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు.విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ (ఐజీఎంసీ) స్టేడియంలో వాలీబాల్ ఇంటర్నేషనల్ కోచ్, ద్రోణాచార్య, అర్జున్ అవార్డు గ్రహీత అరికెపూడి రమణారావు, అంతర్జాతీయ ఆర్చర్, అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ ఒలింపిక్ జ్యోతిని వెలిగించి పరుగును ప్రారంభించారు.ఐజీఎంసీ స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ ఎంజీ రోడ్డు, డీవీ మనోర్ హోటల్, మదర్ థెరిసా విగ్రహం, పీబీ సిద్ధార్థ కళాశాల, మొగల్‌రాజపురం, వాటర్ ట్యాంక్ రోడ్డు మీదుగా మళ్లీ ఐజీఎంసీ స్టేడియంకు చేరుకుంది. ఈ సందర్భంగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, ఆటలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడలు, క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు, ప్రధాన కార్యదర్శి పి పద్మజ బాల, ఉపాధ్యక్షుడు కె రాజేంద్రప్రసాద్, అసోసియేట్ జాయింట్ సెక్రటరీ ఈ సులోచన, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి దయాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థిని షణ్ముఖికి జాతీయ స్థాయి అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈ నెల 16 నుండి విజ్ఞాన్ యూనిర్శిటీలో జరుగుతున్న సాంస్కృతిక పోటీలలో కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలో బిఎ ఎల్ ఎల్ బి ప్రథమ సంవత్సరం చదువుతున్న జె.షణ్ముఖి జాతీయ స్థాయి అవార్డును సొతం చేసుకుని రికార్డు సృష్టించిందని కెఎల్ డీమ్డ్ యూవర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ ఆంధ్రా ఎన్ సిసి బెటాలియన్ కు చెందిన జె.షణ్ముఖి గత పది రోజులుగా విజ్ఞాన్ యూనిర్శిటీలో ఏక్ భారత్ -శ్రేష్ఠ భారత్ అనే కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. అయితే కూచిపూడి నృత్య ప్రదర్శనతో కెఎల్ యు విద్యార్థిని జె.షణ్ముఖి అత్యంత ప్రతిభ కనబరిచి ఆహుతులను ఆకట్టుకుని ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఎన్ సిసి గుంటూరు జిల్లా గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ షణ్ముఖి కి అవార్డును ప్రధానం చేసి అభినందించారు . ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థివిభాగాధిపతి సలహాదారులు డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, డాక్టర్ హబీబుల్లాఖాన్, హాబీక్లబ్ ఇంచార్జి ఆర్.సుబాకర్ రాజు, 25వ ఆంధ్రా ఎన్ సిసి బెటాలియన్ కల్నల్ ఎస్.సిద్ధు, , సుబేదార్ మేజర్ విజయ్ మోహిత్, సమన్వయకర్త జి.చంద్రశేఖర్ తదితరులు షణ్ముఖిని అభినందించారు.

స్వచ్ఛ భారత్ ఎక్కడ ?

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివిసీమలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు మచ్చుకైనా కనిపించడం లేదు. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ 2014 లో ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం అయిన అనంతరం స్వచ్ఛ భారత్‌కు పిలుపునిచ్చారు. ఆ సమయంలో పిలుపు నందుకున్న పలు గ్రామాల వారు స్వచ్ఛందంగా రోడ్డు ఎక్కి స్వచ్ఛ కార్యక్రమాలను నిర్వహించగా రానురానూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అటకెక్కించారు. అవనిగడ్డ గ్రామంలోకి అడుగు పెట్టగానే చెడు వినవద్దు, చెడు చూడవద్దు, చెడు మాట్లాడవద్దు అంటూ మూడు కోతి బొమ్మలు దర్శనం ఇస్తూ ఉంటాయి. నేడు ఆ సూక్తులను తెలిపే కోతి బొమ్మలను మూసివేస్తూ పిచ్చి మొక్కలు, దట్టంగా పెరిగాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి మరి.

ప్రాథమిక విలువలు కాపాడాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక విలువలు మారకూడదని ప్రతి ఒక్కరికి సమానత్వం స్వేచ్ఛ సౌభ్రతత్వం కలిగి ఉండాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఐలాజ్ (ఎఐఎల్ఎజె) జాతీయ ప్రధాన కార్యదర్శి,ఎఐఎల్ఎజె క్లిఫ్టన్ డి రోజూరియో సూచించారు. దేశ ప్రజల ప్రాథమిక ,ప్రజాస్వామిక హక్కులను రక్షించడంలో రాజ్యాంగ పరంగా ఎదురవుతున్న వాటిపై చర్చించటానికి ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఆంధ్రప్రదేశ్ ఐలాజ్ (ఎఐఎల్ఎజె) అధ్వర్యంలో అదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన క్లిఫ్టన్ డి రోజూరియో మాట్లాడుతూ రాజ్యాంగ నైతిక విలువలు పాలకులు పాటించాలని, అవి పాటించకుండా అన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పౌర హక్కుల సంఘం నాయకులు చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత దేశ రాజ్యాంగాన్ని పాలకులు దశాబ్దాలుగా భారత రాజ్యాంగం యొక్క విలువల్ని కాలురాస్తూనే వస్తున్నారన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛకు తీసుకు వచ్చినటువంటి సవరణలు ఏవైతే ఉన్నాయో, ఆ సవరణలో పబ్లిక్ ఆర్డర్ అని తీసుకువచ్చి ఉపా చట్టాన్ని తీసుకువచ్చారన్నారు.ఈ చట్టం ద్వారా ప్రభుత్వాన్ని విమర్శించిన,నిరసన తెలియజేసిన,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గురించి మాట్లాడిన దేశద్రోహం అనే చట్టాలను అమలు చేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే పాలకుల చర్యలను ఎండ కట్టాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని పిలుపు ఇచ్చారు.ఈ సమావేశంలో ఏపీ హైకోర్టు న్యాయవాది ఎన్.జేసురత్న కుమార్, హక్కుల వేదిక నాయకులు డి.రోహిత్ మానవ, బెజవాడ బార్ అసోసియేషన్ నాయకులు న్యాయవాది ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్,అడక్ కోర్ కమిటీ సభ్యురాలు సాయి లక్ష్మి,అనూహ్య,పి వెంకట్రావు,సిహెచ్ భాస్కరరావు, పి.రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

రేపటి నుంచి సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-విజయవాడ : సీపీఐ ఎన్టీఆర్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జూన్ 27, 28 తేదిలలో జరగనున్నాయని పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాలోని దాసరి భవన్ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ క్లాసులు జరుగుతాయని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శిక్షణ తరగతులను ప్రారంభించి ' పార్టీ నిర్మాణం-నిబంధనావళి' అనే అంశాన్ని బోధిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు 'మార్క్సిస్టు తత్వశాస్త్రం-మూల సూత్రాలు' అనే అంశంపై ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యడులు చలసాని వెంకట రామారావు వివరిస్తారని, సాయంత్రం 4.30 గంటలకు 'రాజకీయ అర్థశాస్త్రం-మూల సూత్రాలు' అనే అంశంపై బి.జమిందార్ ఉపన్యాసం చేస్తారని తెలిపారు. రెండవ రోజు బుధవారం ఉదయం 10 గంటలకు 'భారతదేశ చరిత్ర-సంస్కృతి' అనే అంశంపై సోమసుందర్, మధ్యాహ్నం 12 గంటలకు ' పార్టీ కార్యక్రమం'లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్.మూర్తి, మధ్యాహ్నం 2.30 గంటలకు 'జిల్లా సమగ్రాభివృద్ధి-భవిష్యత్ కర్తవ్యాలు' అనే అంశంపై సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు క్లాసులు తీసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం చర్చ-వివరణ-ముగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ప్రజాసామ్య హక్కులనేత ఏసు : బుట్టి రాయప్ప

విశాలాంధ్ర-విజయవాడ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం చివరి వరకు పోరాడిన ధన్యజీవి క్కుల ఏసు అని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప నివాళు లర్పించారు. స్థానిక గిరిపురం నివాసి ఓపీడీఆర్ నాయకులు ఏసు సంస్మరణ సభ బాలోత్సవ భవన్లఓ ఆదివారం జరిగింది. సభలో రాయప్ప మాట్లాడుతూ గిరిపురం ప్రాంతంలో పేదల నివేశన స్థలాల కోసం మాత్రమే కాకుండా స్మశాన స్థలాల కోసం కూడా ఏసు అలుపెరుగని పోరాటాలు చేశారని తెలిపారు . దళితులపై దాడులు, అకృత్యాలు జరిగన సందర్భాలలో ఐక్య ఉద్యమాలలో ఏసు ప్రముఖ పాత్ర వహించారని గుర్తు చేసుకున్నారు. ఈ సభలో సీపీఐ నాయకులు జి.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో ధరల పెరుగుదల

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-మైలవరం : అటు కార్పొరేట్స్ ప్రయోజనాలు, ఇటు పాలకుల స్వలాభాల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసినందువల్ల సంభవించిన దుష్ఫలితాలతో విద్యుత్ ఛార్జీలతో సహా అన్ని రకాల ధరలు భరించేలేనంతగా పెరగటంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచి ప్రజలపై పెనుభారాలు మోపిన ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ నెల 20 నుంచి 25వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం మైలవరంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫిక్స్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, విద్యుత్ డ్యూటీ, ట్రూఆప్ చార్జీలు ఇంధన సర్దుబాటు చార్జీలంటూ రకరకాల పేర్లతో ప్రజలను మభ్యపెట్టి ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. వీటికి తోడు వ్యవసాయ పంపుసెట్లతో ప్రారంభించి, షాపులు, చిన్న వ్యాపారస్తుల దుకాణాలకు, నివాసాలకు స్మార్ట్ మీటర్లు బిగించి మొత్తం ప్రజా జీవన వ్యవస్థ మనుగడనే దెబ్బతీయటానికి పథకం సిద్ధం చేశారని చెప్పారు. గత 10 సంవత్సరాల కాలంలో వాడుకున్న కరెంటుకు సర్దుబాటు చార్జీల పేరుతో తాజాగా రూ.6వేల కోట్లు, గత సంవత్సరం రూ.14 వందల కోట్లు భారం ఈ విధంగా వేలాది కోట్ల రూపాయలను ప్రతి నెలా భారం మోపుతూ ప్రజలను జలగల్లా పీల్చుకు తింటున్నారని ఆరోపించారు. కనీసం ఈ దశలోనైనా ప్రజాప్రతిఘటన జరుగకపోతే రాష్ట్ర ప్రజలు ఊహించరాని ప్రమాదాలకు గురి అవుతారని పేర్కొన్నారు. సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్టపాలనా విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమానికి నందియ్య, వీరాస్వామి, ఆదాం,సురేంద్ర, దాసు, దేవమ్మ, నాగరత్నం, దాసరి చిన్ని, నాగేశ్వరమ్మ, పెద వెంకటేశ్వరరావు, నువ్వుల నరసింహారావు, బాలకృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ మైలవరం పైలట్ ప్రాజెక్ట్ హెడ్‌వర్క్‌ర్స్‌లో పాడైన కేబుల్

-విద్యుత్‌కు అంతరాయం- మంచినీరు బంద్

-కొత్త కేబుల్ వేసి విద్యుత్ పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-విజయవాడ : గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా పథకం (ఆర్‌డబ్ల్యూఎస్) మైలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇబ్రహీంపట్నం ఎన్టీపీసీ ప్రక్కన ఉన్న హెడ్ వర్క్సులో 650 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన 75 ఎస్ఎంఎం హెచ్‌టీ కేబుల్ వైర్ సుమారు 25 మీటర్లు పూర్తిగా డ్యామేజ్ అయింది. దీంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. దీంతో పంపింగ్ మోటార్లు ఆగిపోవటంతో మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు మంచినీరు సరఫరా పూర్తిగా బంద్ అయింది. లక్షలాది మంది త్రాగునీరు లేక అల్లాడుతున్నారు. సమాచారం తెలుసుకున్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావుతో హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఇద్దరు విద్యుత్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా శ్రమించినప్పటికీ కేబుల్ పూర్తిగా పాడైపోవటంతో ఫలితం లేకుండా పోయింది. నాణ్యత లేని కేబుల్ వల్ల ఈ నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. అనంతరం సీహెచ్. కోటేశ్వరరావు స్పందిస్తూ తక్షణం డ్యామేజ్ అయిన కేబుల్‌ను తొలగించి కొత్త కేబుల్ వేసి విద్యుత్‌ను పునరుద్ధరించి ప్రజలకు త్రాగునీరు అందించాలని విద్యుత్ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. కారణమేదైనా, కారకులెవరైనా ముందు ప్రజలకు నీరు అందించేందుకు కొత్త కేబుల్ అమర్చి విద్యుత్ పునరుద్ధరించాలన్నారు. రెండు నియోజకవర్గాల దాహార్తిని తీర్చాలని సంబంధిత అధికారులను ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ భారాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజల మీద భారాలు వేయటాన్ని నిరసిస్తూ ప్రజా శ్రేయస్సు కై జరిగే ఐక్య ఉద్యమాలకు రాజకీయాలకతీతంగా ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని కోరుతూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సింగ్‌నగర్ కృష్ణ హోటల్ సెంటర్, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద, సాయంత్రం పటమట ఏరియా చాపల మార్కెట్ అప్పారావు గ్రంథాలయం వద్ద జరిగిన నిరసన ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టటం కోసం ట్రూఆప్ చార్జీల భారాన్ని ప్రజలపై రుద్దుతున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ అవినీతికి స్మార్ట్ మీటర్ల కొనుగోలు ఒప్పందాలపై న్యాయవిచారణ చేస్తే అవినీతి వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. అదానికి, ఇతర కార్పోరేట్లకు విద్యుత్ రంగం మొత్తాన్ని అప్పజెప్పటం దేశద్రోహం అన్నారు. కార్పోరేట్‌దోపిడీ నుంచి విద్యుత్ రంగాన్ని రక్షించుకోకపోతే కరెంటు అనేది సామాన్య పేద ప్రజలకు అందని ద్రాక్షగా ఉంటుందన్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ చేసే ఉద్యమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తండ్రి వ్యతిరేకించిన విద్యుత్ సంస్కరణలను కొడుకు అమలు చేయం దుర్మార్గం: సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు రెండు ప్రాంతాల్లో జరిగిన నిరసన కార్యాక్రమాల్ని ఉద్దేశించి సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తే అతని కుమారుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వాటిని అమలు చేయటం దుర్మార్గమని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగంలో కార్పోరేట్లకు దాసోహం అంటూ అవినీతికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ప్రజాఉద్యమం తప్పదని హెచ్చరించారు. సింగ్‌నగర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు కేవీ భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన వీధి నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కరెంటు బిల్లులు చెల్లించేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కళాకారులు ఈ నాటికలో వివరించారు. 58వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నగర సహాయకార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు కేవీ. భాస్కరరావు, మూలి సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య, లింగాబత్తుల శివకుమార్, డివిజన్ కార్యదర్శి నత్త లక్ష్మీనారాయణ, నాయకులు కే.రామరాజు, కోరే వెంకటేశ్వర్లు, పాపారావు, మాజీ కార్పోరేటర్ తమ్మిన దుర్గ, కే ఆదినారాయణ, ఎస్.చిన్న, గురున్నాధం తదితరులు పాల్గొన్నారు. పటమటలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు దోనేపూడి సూరిబాబు, 15, 16 డివిజన్ కార్యదర్శులు బిట్రా ధనరాజ్, కొండేటి శ్రీను, లంక ప్రసాద్, మహిళా సమాఖ్య నాయకులు లంక నాగమణి, నడకుదిటి విజయలక్ష్మి, సత్యవతి, బి.రమ, బి.నాగేంద్రం, టి.లక్ష్మి, లంక ఆదర్శ, గోగుల సైదులు, బి.రవి, సింగరాజు సాంబశివరావు, టి.వెంకటేశ్వరరావు, వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అం దరిపై ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, మునిసిపల్ కౌన్సిలర్ వెంకట కృష్ణ ప్రసాద్ బాబు రూ.50 వేలతో కడియం నుండి తెప్పించిన 250 మామిడి మొక్కలను జామియా మసీద్ పెద్దలకు ఇచ్చారు. ఈ మొక్కలను పట్టణం బలుసుపాడు రోడ్డులో ఈద్గా ఆవరణలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నాటారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మొక్కలు నాటి వదిలివేయకుండా వాటిని సంరక్షించే బాధ్యత ఇక్కడ ఉన్న ముస్లిం సోదరులు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ మొయిద్దీన్, జామియా మసీద్ ప్రెసిడెంట్ షేక్ జలీల్,వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్, కమిటీ సభ్యులు సయ్యద్ అలీ,అల్లా బక్షు,రహమతుల్లా తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండల టీడీపీ నాయకుడు తెల్లదేవరపల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వేగి నాగేశ్వరరావు(60)(నాగయ్య) ఆదివారం మృతి చెందారు. మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామానికి చెందిన ఆయన పార్టీ ఆవిర్భావం నుంచి ఆపార్టీ నేతగా కొనసాగారు. నాగేశ్వరరావుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగయ్య మృతి సమాచారం తెలుసుకున్న పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహాన్ని సందర్శించి, ఘన నివాళులర్పించారు.

ఎంపీ కేశినేని నిధులతో రైతులకు సబ్సిడీ ట్రాక్టర్లు

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : విజయవాడ ఎంపీ నిధులతో రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాక్టర్ లు అందజేసే కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని మాజీ జడ్పిటిసి సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్ అన్నారు. ఎంపీ నిధులతో సబ్సిడీ ద్వారా రైతులకు అందిస్తున్న ట్రాక్టర్లను సీనియర్ తెదేపా నాయకులు దాసరి ఏసుప్రభు, తెలుగు రైతు అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్ తో కలసి ఆదివారం స్థానిక అశోక్ నగర్ లోని ఐచర్ షోరూం నందు ట్రాక్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు భారీ రాయితీతో అందిస్తున్న ట్రాక్టర్ల వలన రైతులకు తమ వ్యవసాయ కార్యకలాపాలలో ఎంతో ఊరట లభిస్తుందని వ్యవసాయం లాభసాటిగా మారే అవకాశం ఉందని అన్నారు చందర్లపాడు మండల పరిధిలోని తుర్లపాడు గ్రామానికి చెందిన రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాక్టర్లను వారు అందజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం తుర్లపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దాసరి చిన్న ప్రభు, ఆవుల నరేష్,అవుకు బాలయ్య, పోపూరి నవీన్,పొల్ల పాపారావు, కొలకలూరి స్వామి, వేల్పుల పూర్ణచంద్రరావు, పరంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు

తుళ్ళూరు రామరావు కుటుంబానికి ఎమ్మెల్యే రక్షణనిధి పరామర్శ

విశాలాంధ్ర-ఎ కొండూరు : చీమలపాడులోని వైసీపీ సీనియర్ నాయకులు తుళ్లూరు రామారావు(55) కొద్దిరోజుల క్రితం పిడుగుపాటుతో మృతి చెందాడు. అయితే ఈ విషయాన్ని వైసీపీ గ్రామస్థాయి సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు జడ్పిటిసి భూక్యాగనియా మోర్ల సాంబశివరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆదివారం ఎమ్మెల్యే రామారావు కుటుంబాన్ని పరామర్శించారు. రామారావు కుటుంబానికి పార్టీ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపి, రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి, తన వంతు సాయంగా రూ.5 వేలు రామారావు కుమారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కోలా నాగమణి నరసింహారావు. మండల వైసిపి యూత్ అధ్యక్షులు కాలసాని చెన్నారావు, పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రాల వెంకటరావు, ఉప సర్పంచ్ ఎస్ వసంతా ప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ సతీష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే సామినేని

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను. తెలిపారు. పెనుగంచిప్రోలు గ్రామం లో ని సొసైటీ కార్యాలయం నందు శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని గుంటూరు, కొమ్మినేని రవిశంకర్ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, జడ్పిటిసి వూట్ల నాగమణి,ఎంపీపీ మార్కపుడి గాంధీ, మండల పార్టీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్,మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాస్, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి,రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేనీ కుమారి,సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి. నరసింహారావు, సొసైటీ కార్యదర్శి. ఎస్.కొండల శర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.10 వేలు విరాళం



విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలోని శాశ్వత అన్న ప్రసాద వితరణకు ఉండవల్లి సెంటర్ వాస్తవ్యులు శెట్టి శ్రీనివాసరావు శిరీష దంపతులు రూ.10 వేలు ఆలయ ధర్మకర్త కోలా రామారావుకు విరాళంగా ఇచ్చారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ ఆలయ అర్చకులు వేద పండితుల చే ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రఘునందన్‌కు మహానంది జాతీయ పురస్కారం

విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరుకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను తెలుగు, హిందీ భాషలలో రచించిన రేపాక రఘునందన్ కు ప్రతిష్టాత్మక మహానంది జాతీయ అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సాంస్కృతిక సంస్థ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ అవార్డును రఘునందన్‌కు అందజేశారు. తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గా, అభ్యుదయ రచయితల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా తెలుగు సాహిత్యాభి వృద్ధికి కృషి చేస్తున్న రఘునందన్‌కు సంస్థ సభ్యులు మాచవరం గౌరీ శంకరాచార్యులు, రంగిశెట్టి రమేష్, కటకం రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి సీతారాం మహేశ్వరి అభినందనలు తెలిపారు.

మర్సకట్ల మృతికి సీపీఐ సంతాపం

విశాలాంధ్ర-తిరువూరు: సిపిఎం నాయకులు మర్సకట్ల ప్రభాకర రావు మృతికి తిరువూరు సీపీఐ నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం ప్రభాకర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుకూరి వెంకటేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కె నాగుల్ మీరా, తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, సహాయ కార్యదర్శి ఎస్కె సుభాని తదితరులు నివాళులర్పించారు.

మోసాలను అరికట్టాలని చాటిన గురువింద గింజలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సమాజంలో ఇతరులను నమ్మేట్లు భ్రమింపచేస్తూ అనేక రకాలుగా మభ్యపెడుతూ చేస్తున్న మోసాలను అరికట్టాలని గురివింద గింజలు వలె కాక గురుతర బాధ్యతతో మంచికి విలువలనిస్తూ ప్రతి పౌరుడు జీవనం సాగించిన నాడు మానవాళి వసుదైక కుటుంబంగా వెలుగొందుతుందనే ఇతివృత్తంతో గురువిందగింజలు నాటిక ప్రదర్శితమైంది. దృశ్య వేదిక నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం హాలులో బివి శ్యాం ప్రసాద్ రచించగా పవన్ కుమార్ దర్శకత్వం వహించిన ఈనాటిక సాగర్ ఆర్ట్ థియేటర్స్ (విజయవాడ) సమర్పణలో ప్రదర్శితమైంది. ప్రారంభంలో కూచిపూడి నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ శిష్య బృందం సాయి, భవ్యశ్రీ, గ్రీష్మ, లాస్య, గీతిక, సాధన, హవినాష్, సహస్ర, చరిష్మా, మోక్షిత, పాండిత్య, జ్యోతిలు పలు శాస్త్రీయ జానపద నృత్యాంశాలను అభినందనీయంగా ప్రదర్శించారు.

పాఠ్యాంశాలు... శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించాలి

విశాలాంధ్ర-తిరువూరు: తరగతి గదుల్లో బోధించే పాఠ్యాంశాలు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ అన్నారు. జేవివి ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మూఢ 'నమ్మకాలు-శాస్త్రీయ విజ్ఞానం' అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న మూఢ నమ్మకాలను నిర్మూలించాలంటే, శాస్త్రీయ పరిశోధనలకు ఎక్కువ ప్రాధాన్యత పెరగాలన్నారు. ఇటీవల పాఠ్య పుస్తకాల్లో శాస్త్రీయ దృక్పథం పెంచే పాఠాలను తొలగించడం, శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిశోధనలకు అందించే ప్రోత్సాహకాలు, పురస్కారాలను రద్దు చేయడం వల్ల సమాజంలో అశాస్త్రీయ వాదనలకు మరింత బలం పెరిగే ఆస్కారం వుంటుందని గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవివి ప్రతినిధులు యం రాం ప్రదీప్, ఎం నాగేంద్ర ప్రసాద్, పి శోభన్ బాబు, డి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ఒక యువకుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. సేకరించిన వివరాల ప్రకారం, తాతకుంట్ల తండా గ్రామానికి చెందిన బాణావతు బాలు కుమారుడు చిన్నబాబు(28)కు అతని భార్యతో గత నుంచి విభేదాలు ఉండగా, ఆమె ఆమె పుట్టినిల్లు రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట తండాలో ఉంటోంది. ఈ నేపథ్యంలో తన భార్య కాపురానికి రాని విషయంపై చర్చిస్తానంటూ శనివారం చిన్నబాబు అత్తింటికి వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం ఫోన్ ద్వారా తాను అవమానానికి గురయ్యానని, ఆత్మహత్య చేసుకుంటున్నానని సమాచారం ఇవ్వటంతో కుటుంబసభ్యులు విస్సన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చి, అతని కోసం గాలించారు. ఆదివారం ఉదయం ఎ.కొండూరు రోడ్డులోని స్థానిక ఎన్నెస్పీ కాలువ సమీపంలో విగతజీవుడై పడి ఉన్నారు. విస్సన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

సీపీఎం నేత ప్రభాకరరావు మృతి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటకు చెందిన సీపీఎం, టీడీపీ నేతలు ఆదివారం మృతి చెందారు. విస్సన్నపేట తొలి జడ్పీటీసీ సభ్యునిగా సీపీఐ, టీడీపీ మద్దతుతో గెలుపొందిన మర్సకట్ల ప్రభాకరరావు(60) అనారోగ్యంతో గుంటూరు జిల్లా ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో గత కొంతకాలంగా చికిత్స పొందుతూ, ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఎ.కొండూరు మండలానికి చెందిన ప్రభాకరరావు తొలి నాళ్ల నుంచి వామపక్ష ఉద్యమాల్లో పోషించటమే కాక, సీపీఎం పార్టీ విస్సన్నపేట, తిరువూరు మండలాల్లో పార్టీ అభివృద్ధికి తీవ్ర కృషి చేశారు. సీపీఐ విస్సన్నపేట మండల కార్యదర్శి త్యాగరాజు ప్రభాకరరావుకు స్వయానా సోదరుడు. ఆయన మృతి సమాచారం తెలిసిన పలు పార్టీల నేతలు, ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ : సూర్యారావుపేట సెక్షన్, సిటీ సబ్ స్టేషన్, 11కేవీ నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మత్తులు మైంటెనెన్సు నిమిత్తము సోమవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏపీసీపీడీసీయల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపు ప్రదేశాలు : నక్కలరోడ్డు, గోపరాజు రామచంద్రరావు వీధి, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, వెంకటరత్నం వీధి, ఏలూరురోడ్డు గోస్సై దొడ్డి ఏరియా,సోనోవిజన్ (పాత విజయాటాకీస్)ఏరియా, విష్ణు వర్ధనరావు వీధి, పీసపాటివారి, తాడేపల్లి వారి వీధి, కోకా చలపతిరావు వీధి, డోర్నకల్ రోడ్ ఎండోకేర్ హాస్పిటల్ ఏరియా లలో విద్యుత్ సరఫరా ఆపబడునని పేర్కొన్నారు. ఆయా ఏరియాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన వైద్యుల బృందం

విశాలాంధ్ర-చల్లపల్లి : స్ఫూర్తివంతమైన స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం అభినందనీయమని వైద్య ప్రముకులు తెలిపారు. చల్లపల్లిలో వైద్య దంపతులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్..డాక్టర్ పద్మావతిల నేతృత్వంలో 2800 రోజులకు పైగా సాగుతున్న స్వచ్ఛ ఉద్యమాన్ని పరిశీలించేందుకు వివిధ ప్రాంతాల నుంచీ వైద్యబృందం చల్లపల్లి వచ్చారు. హైదరాబాద్ సన్షైన్ హాస్పటల్స్ ఎండీ డాక్టర్ ఏవీ. గురవారెడ్డి చొరవతో గుంటూరు మెడికల్ కళాశాల 1977 బ్యాచ్ వైద్య విద్యార్థులు (వైద్యులు) సుమారు 30 మంది స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించారు. ఆదివారం తెల్లవారుజామున స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి స్వచ్ఛసేవలో పాల్గొని జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటారు. గ్రామం కోసం శ్రమిస్తున్న స్వచ్ఛ కార్యకర్తల సేవానిరతిని వైద్యబృందం ప్రత్యక్షంగా చూశారు. స్వచ్ఛ చల్లపల్లి విశేషాలను స్వచ్ఛ సారథులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్..డాక్టర్ పద్మావతిలు వైద్యబృందానికి తెలిపారు. సన్షైన్ హాస్పటల్స్ ఎండి డాక్టర్ ఏవి. గురవారెడ్డి, ఏపీ మెడికల్ సర్వీసెస్ మాజీ జేడీ డాక్టర్ జేవీ.ప్రసాద్, డాక్టర్ అరవింద్, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ కాలేషావలి, డాక్టర్ అనూరాధ, డాక్టర్ రవి, డాక్టర్ భార్గవి, డాక్టర్ లక్ష్మి, ఏపీ ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ రెహమాన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చల్లపల్లిని సందర్శించిన వైద్యులంతా హైదరాబాద్, ముంబాయ్, విజయవాడ, గుంటూరు, జంగారెడ్డిగూడెం, మార్కాపురంలలో స్థిరపడినవారే. వివిధ వర్గాల ప్రముకులు, స్వచ్ఛ కార్యకర్తలు, పద్మావతి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభే అవార్డులకు ప్రామాణికం కావాలి

విశాలాంధ్ర-గుంటూరు : అవా ర్డులు ఎవరికిచ్చినా ప్రతిభ ప్రామాణికంగానే ఇవ్వాలని, అవార్డు ప్రకటించాక ఆ అవా ర్డుపై విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలపైనే ఉందని నాటకరంగ ప్రముఖులు, నట కంఠీరవ బిరుదాంకితులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి అన్నారు. గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'కవిమిత్రుల కలయిక-కవి సమ్మే ళనం' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ద్రౌపది పాత్రతో నాటక రంగంలో ప్రవేశించానని, తర్వాత దుర్యోధనుడి పాత్ర కొన్ని వేలసార్లు పోషించానని అన్నారు. ఎన్నో అవార్డులు, ప్రశంసలు పొందానని, అప్పట్లో అవార్డులపై ఎప్పుడూ విమర్శలు వచ్చేవి కాదన్నారు. నాటకరంగంలో కొనసాగుతూనే జంధ్యాల పాపయ్యశాస్త్రి, గుర్రం జాషువా పద్యాల సాహచర్యంతో పద్యాలు కూడా రాయగలిగానని ఆయన అన్నారు. ఉత్తమ కవిత రాసిన మండే సుబ్రహ్మణ్యంని తుర్లపాటి రాధాకృష్ణమూర్తి చేతుల మీదుగా నగదు బహుమతితో సత్కరించారు. సభకు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా 'శ్యామ' పుస్తక అనువాదకులు కందిమళ్ళ శివప్రసాద్, డాక్టర్ వంగిపురపు శారదాదేవి, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ సొపాటి ప్రభాకర్, ఆళ్ళ నాగేశ్వరరావు, రహీమ్ సాహెబ్, కారంచేటి విజయ్ కుమార్, గోలి హనుమచ్ఛాస్త్రి, తాటికోల పద్మావతి, యక్కంటి పద్మావతి, మన్నం వెంకటగురువు, కొణతం నాగేశ్వర రావు, కె.లీలాకృష్ణ, బాబూ మస్తాన్, పింగళి భాగ్యలక్ష్మి, మండే సుబ్రహ్మణ్యం, బండికల్లు జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

అన్నే నరసింహారావుకు ఘననివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : పెదవడ్లపూడిలో సీపీఐ సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, మాజీ పంచాయతీ వార్డు మెంబర్ అన్నే నరసింహా రావు సంస్మరణ కార్యక్రమాన్ని పెద్దవడ్లపూడిలోని వై గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం, జై ఆంధ్ర ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, జవ్వాది సాంబశివరావు, పంతగాని మరియదాసు, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, సుంకర వెంకటనారాయణ, భావన లక్ష్మీనారాయణ, సైకం శివయ్య, యేళ్ళ సాంబశివరావు, రాజా రావు, నాగళ్ళ వెంకట్రావు, శివయ్య, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతమూర్తికి 'నాటా' ఆహ్వానం

విశాలాంధ్ర-గుంటూరు : నాటా(నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్) ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేది నుంచి జులై 2వ తేది వరకు డల్లా స్‌లో జరిగే తెలుగు సభలకు తనకు ఆహ్వానం అందినట్లు వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, అవర్ స్టేట్ అవర్ లీడర్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అమెరికా, కెనడాలోని తెలుగు ప్రజల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చిండంతో పాటు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ప్రపంచ దేశాలలోని తెలుగు ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరయ్యే ఈ సభలకు తనకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని అన్నారు.